# ఈశకథ మాగరించే



**—అవసరాల రామకృష్ణారావు**

"నీకంటె దరిద్రగొట్టు మొహం ఈ చుట్టు ... ఉండదు" అన్నాడు అతను.

"మిమ్మల్ని మించిన బ్రహ్మరాక్షస ఘటం ... భూమ్మీద ఉండదు" అంది వెంటనే. అతని ...హధర్మచారిణి కదూ మరి?

"మరి మన యిద్దరం ఎవరం!"

అన్నట్టు ఒకరివైపు ఒకరు చూసుకున్నారు, ...మ్మా నాన్నల మాటలు అతి శ్రద్ధగా పక్క-గదిలోంచి వింటున్న పదకొండేళ్ళ రవణా, తొమ్మిదేళ్ళ రాజూ.

"దరిద్రగొట్టు మొహం" పేరు గిరిజాకల్యాణి.

"బ్రహ్మరాక్షస ఘటం" పేరు వేణుగోపాల కృష్ణమూర్తి.

"ఏమండీ, మేస్టారుగారూ! "చీవాట్లు" అన్న పదానికి ఏకవచనం ఏమిటండీ?" అని

ఒక కుర్రవాడు అడిగాడు. పాపం మేష్టారికి తెలీదు.

"ఓరి పనికిమాలిన పందా! వెధవన్నర వెధవా, దిక్కుమాలిన పీనుగా" అని ఆయన అందుకున్నారు. ఆ పదానికి ఏ క వ చ న ం అంటూ ఉండదని మాష్టారి మాటలవల్లే కుర్ర వాడికి తెలిసిపోయింది!

నిజానికి గిరిజా, వేణుల సంభాషణ కూడా ఒక్కటంటే ఒక్క వాక్యంతో ఎప్పుడూ పూర్తి అవదు. చదివింది స్కూలు ఫైనలే అయినా మందుల కంపెనీలో పెద్ద ఉద్యోగమే సంపాదించా డతను. వచ్చింది అ నా కా రి కుటుంబంలోంచి అయినా కళకళలాడుతూ ఉంటుంది ఆమె. కుటుంబ నియంత్రణ ఏ కోశాన్నీ అమల్లో పెట్టకపోయినా యిద్దరే పిల్లలు వాళ్ళకి. మనుసులు కూడా మంచివే మళ్ళీ.

"పాపమీ మగవారలు సంసార సాగర మీదుట కొరకెంతయు శ్రమింతురు. వీరలకు విశ్రాంతి ఎంతేని అవసరము" అని త్రికరణ శుద్ధిగా నమ్మి భర్తకోసం ఎంతో ప్రేమతో సాయంకాలం ఎదురుచూస్తూ ఉ ం టు ం ది గిరిజా కల్యాణి.

"ఈయమ నాసుఖమునకై రేయింబవళ్లు కృషిచేయుచున్నది. నేటిగోలె ఈ సాధ్విని పూల పూజింతు" అనుకుంటాడు యింటికి వస్తూ వేణు.

కాని ఇంటికి రాగానే అతన్ని ఆకర్షించేది గిరిజా కల్యాణి చక్కని చిరునవ్వు కాదు. ఎదురుగుండా టేబిల్‌మీద ఉన్న యిత్తడి చెంబు.

"ఎక్కడి వస్తువు అక్కడ పెట్టాలని ఎన్ని వందలసార్లు చెబితే నీకు బుద్ధి వస్తుందీ? మనిషన్న తర్వాత ఒకసారి చెబితే సిగ్గన్నది ఉండాలి."

కొత్తరకం కత్తియుద్ధం ఆరంభం అవు తుంది, నాలికలనే కత్తులతో.

"తీసేస్తాలెండి. చెయ్యి తీ రు బ డి లే క అదక్కడ ఉండడం జరిగింది. అలా మరో గంట ఉంచిచూదాం. ఒకవేళ ప్రపంచం తిరగవడి పోతుందేమో? ఇంతకీ తీసేలోగా మీరు వచ్చా రా యె ను. వ చ్చి రా గా నే ఏదో నేరం ఎంచకపోతే మీరే దాన్ని కాస్త తీసి కింద పెట్టెయ్యవచ్చుగా. ఇత్తడిచెంబుకు ప్రత్యేకించి ఒక జాగా అంటూ ఉందని ఏ శాస్త్రకారుడూ ఎక్కడా ఏడిసినట్టు లేదు మరి."

"ఒకటంటే పది చదువుతావ్, మనిషిజన్మ ఎత్తితేకదూ?"

"ఎత్తితే మిమ్మల్ని కట్టుకోకనే పోదును."

ఆమె అన్న మాటలో అర్థం గ్రహించే ఓపికకూడా అతనికి ఉండదు. ఎలాగో ఆమెకు నచ్చజెప్పడమే అతని ఉద్దేశం.

"చూడూ; తప్పుచేసింది నువ్వు. డ్రాయింగ్ రూంలో టేబిలుమీద ఎవరైనా యిత్తడి చెంబు పెట్టుకుంటారా?"

"మరెక్కడ పెట్టుకుంటా రబ్బా?"

"నువ్వే ఆలోచించు."

"ఆఁ తెలిసిందండీ. పోనీ ఒకపని చెయ్య రాదూ?"

"ఏమిటది?"

"తగినపెట్టి ఒకటి చేయించండి. అందులో యిత్తడి చెంబు పెట్టుకుని ఎంచక్కా తాళం వేసుకుందాం. దానికేమోనట, రెండుతాళాలుట. ఒకతాళం చె వి మీ ద గ్గి రా. ఎవరిక్కావలసి నప్పుడు వాళ్ళు తీసివాడుకుని, మళ్ళీ తా ళ ం వేసేసుకుని కూడా తిప్పుకోవచ్చు. పైన ఒక హేండిల్‌కూడా ఉండాలండోయ్"

గిరిజ పకపక నవ్వేస్తుంది. వేణుకోపంగా లేచిపోతాడు.

"ఈ కోపతాపాల కే మొ చ్చె గా ని కాఫీ సేవించి మరీ వెళ్ళండి. మళ్ళీ మళ్ళీ వేడిచెయ్య మంటే నావల్లకాదు, ముందే చెబుతున్నాను"

"అక్కర్లేదు. ఇల్లాళ్ళకు యింత నరసత ఉండి చచ్చింది గనకనే వీధికొక కాఫీహోటలు చొప్పున వెలసి దిగ్విజయంగా నడుస్తున్నాయ్"

"అయితే ఏ మంటారు?"

"ఏమీలేదు, నీతో నాకేమిటి?" అంటూ వేణు గడగడ కాఫీతాగేసి తొందరగా బయటికి వె ళ్ళి పో తా డు. అయితే ఆ అడుగుల్లోని తొందరపాటు ఆ యింటి ఆ వ ర ణ దాటే

వరకే. ఆ తరవాత ఓ ఏభై అడుగులు వేసి, వెనక్కి తిరిగి, యింటి దారి పడతాడు. ఎంత ఒంటిగా బతికినా చచ్చాకయినా నలుగురితో పని తప్పదుగదా ! అని ఎవరైనా అంటే.

"ఓస్ చచ్చాకగదా, ఎవడు చూడొచ్చాడు !" అనే రకం అతను, ఒంటిపిల్లి రాకాసులకు ఓం ప్రథమంగా అతన్ని చెప్పుకోవచ్చు. గుడి పాములకి గురువుగా పేర్కొనవచ్చు. అయితే పని చేసేచోటూ, తప్పితే యిల్లూ మూడోచోటు అతనికి నప్పదు. వెడితే సినిమా, తప్పితే పుస్తకం-మూడో కాలక్షేపం అతనికి నచ్చదు.

భర్త తిరిగిరావడం చూస్తుంది గిరిజ. అయినా అతని కోసం లేచి ఉండదు. లోపలికి వెళ్ళి వంటకి ఉపక్రమిస్తుంది. అప్పుడనగా ఆటకి పోయారు గుంటవెధవలు. ఆవురావురమని వస్తూఉంటారు. ఈ మూర్ఖపుమనిషితో వాదిస్తూ కూచుని వాళ్ళగొంతుకులు ఎంతకని గొయ్యను! అనుకుంటూ.

ఒక్క అరగంట అవుతుందో లేదో ...

"ఇదిగో, ఓయ్, ఎక్కడా ... ఇంట్లో ఉండమన్నావా, ఎక్కడికైనా ఉన్నపాళాన పొమ్మన్నావా? అంటాడతను అప్రయత్నంగా పుస్తకంలోంచి బుర్ర యివతలికి పెట్టి. అలా అడిగినందుకు నాలిక కరచుకోడానికైనా ఆవిడ అవకాశం యివ్వదు. ఏ తప్పూ లేకుండా అతను ఎందుకిలా నోరు పారేసుకుంటాడో గట్టిగా కనుక్కోవాలందే ఆవిడకు ఉండబట్టదు. చదువు కుంటున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండడం అతనికి యిష్టమని ఆమెకు తెలుసు. కాని ఆ సంగతి కుతకుత ఉడికే అన్నానికీ, కిచ కిచలాడే కొబ్బరికోరాముకీ, చుంయ్ చుంయ్మనే చారు పోపుకీ, ధన్ ధనాల్మని అప్పుడప్పుడు చెయ్యి జారినప్పుడు చప్పుడయ్యే గిన్నెలకీ, ఏం తెలుసు? అదే నిలదీసి అడుగుతుంది ఆమె.

"నే నొచ్చాక నా నెత్తిమీదే వంట తగలడాలా? రోజంతా ఏం ఊడబెట్టుకొంటావు?" అని సుకుమారంగా మందలిస్తాడు.


స్వాగతం.... సుస్వాగతం....

## అసలు సంగతి

విజయవాడ పట్టణానికి విచ్చేసిన మీకు రుచిగా, శుచిగా ఉండే ఒక్క మంచి శాకాహార భోజనం కావాలి.... అంతేగా....

భయపడకండి....

గవర్నరుపేట బిసెంట్ రోడ్డులో దేవేంద్ర [illegible] బృందావన భవనం వుంది....

హాయినిచ్చే చక్కని ఎయిర్ కండిషన్ గదులు అందమైన పార్టీలకు రూఫ్ గార్డెన్ వసతి....అన్నీ ఉన్నాయి ...

ఒక్కసారి దయచేయండి. మీ ఆనందమే మా పరమార్థం....

మా ఫోను నెంబరా ?........5 3 7

"నోరు కప్పితే చాలు, ఎందుకలా గింజు కుంటారు? ఎంతసేపు ఆ దిక్కుమాలిన భ్రష్టాకారి మాటలేనా, మరేం మంచీ చెడ్డా లేదూ?" అని ఆమె సున్నితంగా జవాబు చెబుతుంది. అంతటితో ఊరుకుంటుందా - పంతం వచ్చి, చేస్తూ చేస్తూన్న వంట మానేసి, చేతులు కడుక్కొని వచ్చి "పిల్లలూ మీరు ఎం చేస్తారో చేసుకోండి. చప్పుడుకాకుండా వంట చెయ్యడమేమిటో నేనరగను బాబూ" అంటూ నడవలో కోపంగా చతికిల బడుతుంది ఆమె.

కాని అలా అట్టేసేపు కూచోలేదు ఆమె.

వంట తప్ప మరొక వ్యాపకం లేదు ఆమెకు.

వండడానికి వడ్డించడానికీ ఆమె జన్మించింది.

ఆమె చేతిలోంచి ఎవరైనా వండుతున్న గరిటె లాక్కుంటే వారిని హత్యచెయ్యడానికేనా ఆమె సందేహించదు.

"ఛ, యీయనతో నా కేమిటి" అని పనిలోకి చొరబడుతుంది. అయితే యీ కస్సు బుస్సులు కేవలం మనస్సులకు మాత్రమే. శరీరాలకు మాత్రం అంత మోహమాటంలేదు. పాపం వీటైనపుడల్లా ఒకటితో ఒకటి రాజీపడుతూనే ఉన్నాయి.

* * *

గిరిజ కళ్లమూసుకుని వెంకట్రవణమూర్తి పటానికి దణ్ణంపెట్టుకుంది. కళ్ళు తెరిచేసరికి దేవుడి పీఠం మీద వేణు మఠంవేసుకుని కూచుని కనిపించాడు. అతను నోరు తెరిచాడు. అందులో బెల్లంముక్క ఉంది. అదిచూచి ఆమె నోరు తెరిచింది. అందులోంచి పిడుగులు రాలేయి. "మీ కేమైనా మతుందా, పోయిందా? శనివారంపూట దేవుడికి మడిగా ఇంత దీపం పెట్టుకుందామంటే అంతా అపచారం చేసి పారేస్తారా? ఆఖరికి పసివెధవలకంటె అద్వాన్నం అయిపోయారే! మళ్ళీ ఎన్నిసార్లని స్నానం చెయ్యను చెప్పండి?"

"ఒద్దుఅంతపనిమాత్రంచెయ్యకు. ఇప్పటికే తొమ్మిదిన్నర అయింది. ఎప్పుడు ముద్ద మింగను, ఎప్పుడు డ్యూటీకి తగలడను?"

"ఈ ఒక్కరోజుకీ ఆ మాత్రం సర్దుకోలేరా? ఇంతకీ నా మటుకు నేను పూజ చేసుకుంటూంటే మధ్య యీయన కెందుకమ్మా?"

"ఎందుకా? నే నెవరనుకున్నావ్? నీ మొగుణ్ణి. నీ ప్రత్యక్ష దైవాన్ని. ముందు లెంపలేసుకుని నా పాదాలు కళ్ళకద్దుకో. నాకూ పిల్లలకీ వేళపట్టున యింత వండిపెట్టని నీ పూజ లెందుకు? ఏడవనా?"

"బాగుంది వరస. చిరునవ్వులు మూటగట్టే ఆ దేవుడెక్కడ, కోపంతప్ప మరొకటి ఎరగని మీరెక్కడ?"

"నిజమే. మా ఇద్దరి మొహాలూ పక్కపక్కనే ఉన్నాయి. కళ్ళుంటే చూడు. రెప్పలూ కళ్ళూ నుదురూ అన్నీ కలిసిపోయి ఓ పెద్ద తెల్లని పట్టె నామంతప్ప, అదిఒక దివ్య మంగళ విగ్రహమా!"

"అయ్యయ్యో. ఆ చల్లని తండ్రి నే దూషిస్తున్నారా? ఇవాళ మీ కేమొచ్చింది. అపచారం! అపచారం! లెంపలేసుకొండి! సర్వేశ్వరుడు ఆయనెక్కడ. సముద్రంలో కాకిరెట్ట మనమెక్కడ?"

వేణు పక్కగదిలో పక్కమీద చతికిలబడిపోయాడు. అంతేనా, తన విలువ అంతేనా. అంతకన్న యింకేమీలేదా? అతనికి యీ సంసార సుఖమంతా ఒక్కసారిగా శుష్కమూ శూన్యమూ అయిపోయిందా అనిపించింది. లేచి కిటికీ తలుపు తీసి అటు చూశాడు -

ఆమె సాష్టాంగ పడి లేస్తోంది. ఆకళ్ళనిండా నీళ్ళు. ఇన్నేళ్ళు యిలాంటి మనిషితో ఎలా కాలక్షేపం చేశానా అని అతని కమితమైన ఆశ్చర్యం కలిగింది. ఆ కన్నీటి నిజాయితీని తను శంకించలేడు. కాదని వాటిని ఖండించనూ లేడు. అలాగని ఊరుకోనూ లేడు.

ఆమెకి ఇరవై ఎనిమిది. తనకిముప్పైఒకటీ. తమ యిద్దరి మధ్యా యింత ఎదిగిన పిల్లలున్నారంటే అందరూ ఆశ్చర్యపోతారు. ఆ పిల్లలు కూడా వాళ్ళేమో వాళ్ళలోకమేమో అంతే. వాళ్ళ తరవాత మరి ఎవరూ లేకపోడం వాళ్లని మరింత దగ్గిర చేసింది. కొట్టుకున్నా, కలిసి ఆడుకున్నా, లేదా చదువుకున్నా అది ఒక

విడదీయరాని జత. అసలు వాళ్ళ విషయంలో పెద్దవాళ్ళకిఎప్పుడూసమస్యేలేదు. పెద్దవాళ్ళిద్దరే ఒకరికొకరు ముడిపడిన, మరి విడని, ఎడతెగని సమస్య.

"చూడు; చెయ్యి కడుక్కుని ఓసారి యిలా నా దగ్గరకొచ్చి కూచోవూ? యివాళ మంచి చిత్రం జరిగింది. చెబుతానూ..."

"అవన్నీ పనీ పాటాలేని మీ బోట్లకి. చేతి నిండా పనున్న నా కెలా తీరుతుంది?"

ప్రైమ్ మినిష్టరుకయినా విశ్రాంతి ఘడియ లంటూ ఉంటాయి గాని గిరిజా కళ్యాణికి చెయ్యి తీరుబాటు అన్నది యిప్పట్లో జరగదు. అతనికి ముద్దూ ముచ్చటా అన్నది ఈ జన్మలో తీరదు.

"చూడూ లోకంలో నువ్వే వండు తున్నావా? ఇక తక్కిన ప్రపంచమంతా పస్తే అంటావా?"

"అవున్లెండి; ఏవేళ కేది కావాలో అమర్చి పెడుతూంటే నా విలువ మీ కెలా తెలుస్తుంది? ఆ మూడు రోజులూ మీకూ పిల్లలకీ ఎక్కడి యిబ్బంది అవుతుందో, ఎవరిచేత వండ పెట్టించడమా అని ఆ ఇరవైఏడు రోజులూ ఆలోచిస్తూ ఉంటాను. నే నుండగా నా మంచి మీరు గ్రహించలేరు."

"అవును. ఏ హోటల్నుంచో క్యారియరు తెప్పించేస్తానంటే నువ్వువినిపించు కోవాయెను దానికి నే నేం చెయ్యను!"

"అంతేలెండి. కృతఘ్నత అంటే ప్రపంచంలో యింతకన్న యింకేముంది" అనుకుంటుంది ఆమె. అలా అనుకోడంలో ఆమెకు చిత్రమైన ఒకతృప్తి కూడా లేకపోలేదు. చిన్నప్పట్నుంచీ హోటల్లో కాఫీ అయినా తాగకుండా పెరిగాడు వేణు. కావలసినవన్నీ యింటి దగ్గిరే చేసిపెట్టి, ఒక్క కొడుకని అతి ముద్దుగా పెంచారు అతన్ని. అంతకంటె మురిపెంగా చూసుకుంటోంది తను కాపురానికి వచ్చిం దగ్గిర్నుంచీ. ఎవరైనా భోజనానికి పిలిచినాకూడా


# నాదంతా పెద్దకథ....

పెద్దమనిషినే....దయాహృదయుడ్నే. ఒకస్త్రీ పరువు. ప్రతిష్ఠ కాపాడటానికి నా ప్రేమనుకూడా త్యాగంచేశాను .... కాని ఏంలాభం? నేనుచేసిన ఈ సత్కార్యాన్ని మానాన్న సహించలేక నన్నూ, నాభార్యనూ ఇల్లో నుంచి గెంటేశాడు. ఆతర్వాత ఏంజరిగిందంటే ఏంచెప్పను?

జూన్‌లో "ప్రీత్ నా జానేరీత్"

వెండితెరపై చూస్తే మీకేతెలుస్తుంది. మూవీస్థాన్‌వారు ఈ కథనంతా వెండితెర కందిస్తూంటే, కల్యాణ్‌జీ, ఆనందజీలు .... లక్ష్మీకాంత్ ప్యారేలాలు సహాయంతో మనోహరంగా వాయిద్యాలు ప్రయోగించారు. మిమ్మల్ని చూడటానికి ఎస్. బెనర్జీ నాయకత్వాన నజీర్ హుస్సేన్, బి సరోజాదేవి, సిద్దూ, మీనూముంతాజ్, జానీవాకర్, షమ్మీ, ధుమల్, అందరితోకలసి నేనూ వస్తున్నా .... తెరపైకి. మిమ్మల్ని ఆంధ్ర దేశానికి పరిచయం చేస్తున్న వియొలైట్ పిక్చర్సువారికి కృతజ్ఞుడిని,

మీ ప్రియ మిత్రుడు,
షమ్మీకపూర్.

ఏదో సాకుచెప్పి తప్పించుకునే రకం అతను: అతని ఆ బలహీనతే ఆమె పదిలంగా ప్రాణప్రదంగా చూసుకుంటోంది. అదే ఆమె సానుభూతీ, జాలీ, ప్రేమా, ఆకర్షణా. దాన్ని చూసుకునే ఆమె బతుకుతోంది.

అయితే దానికే ఒకనాడు ఆమె భరించలేనంత పెద్దదెబ్బ తగిలింది. ఆరోజు పిల్లలు ఎంత పిలిచినా భోజనానికి వచ్చారు కారు. శలవురోజు కొబట్టి వీధిలో ఆడుతూకూచున్నారు. పొద్దుట చద్దెన్నమైనా తిన్నారుకాదు. అఖరికి గిరిజ గావు కేకలకి ఎలాగైతేనేం ఊడిపడ్డారు.

రాజు ముందు ఎంతో ఆకలితో యింట్లోకి పరిగెత్తుకొచ్చేడు. ఆ తొందర్లో దారిలో ఉన్న ఎంగిలిని తొక్కేశాడు. అంతా అంటు చేసేశావని వెంటనే వాడి వీపున నాలుగు అంటించింది గిరిజ. పావుగంట వరకూ వాడు ఏడుస్తూనే ఉన్నాడు. వాడు భోంచేస్తే కాని తనూ చెయ్యనని రమణా బిగుసుకు పోయాడు. ఇద్దరూ కడుపునిండా యిన్ని మంచి నీళ్ళు త్రాగి పడుకున్నారు. మళ్ళీ మధ్యాహ్నం రెండింటికి గాని వాళ్ళు లేవలేదు.

జరిగిందానికి ఎంతో నొచ్చుకుంది గిరిజ. వాళ్ళని లేపి తీసుకొచ్చి బతిమాలి అన్నం పెడదామని ఆ గదివైపు వెడుతోంది. అది అలా సవ్యంగా జరిగి ఉండేదే. కాని మధ్యలో వేణుప్రవేశించడం జరిగింది. ఒకమాట అన్నాడా ఒకటి అనలేదా అని—

తిండి లేనంత మాత్రాన మనుషులు చచ్చిపోరన్నాడు. నువ్వు లేకపోతే ప్రపంచం ఆగిపోదన్నాడు. కన్నతల్లే యిలా చెయ్యడానికి అదెంత కఠిన హృదయమో అన్నాడు. ఇలా యివాళ నువ్వు పిల్లల్ని ఏడిపించిన సంగతి నేను జన్మలో మరచిపోనన్నాడు. ఇలాంటి కన్నీటి కూడు పిల్లలికి పెట్టకపోడమే ఆరోగ్యకరమన్నాడు. అంతేనా?

నువ్వు పూర్వకాలం మనిషివి. అసలు మీది రాతియుగం నాటి కొండ చిలువలవంశం. మీ కుటుంబం మూలపురుషుడు కె. మండూకం గాడు అయివుంటాడు. ఆహారం అంటే పడి చస్తాడు, మానవత్వం మంటగలిసినాసరే, అరవైయ్యో శతాబ్దం వచ్చినా అర అడుగు ముందుకు వెయ్యని ఆటవికుల జాతిమీది, అని ఎత్తి పెట్టేడు.

ఇంకో అన్ని అనడానికి అవాళ ఆ యింట్లో అప్పటివరకూ భోజనమంటూ చేసింది వేణు ఒక్కడే.

అన్నివిధాలా నీరసంగా ఉంది గిరిజా కళ్యాణికి. మరొక సమయంలో అయితే ఊరుకుని అన్నీ పడి ఉండడం ఆమెకు అసహజమైన విషయం. అతను అంతటితోనైనా ఊరుకున్నాడా—

"ఏమిటి పెద్ద నువ్వు యింట్లోచేసే చాకిరీ? ఒకవేళా లేదు. ఒక పద్ధతి లేదు. ఒక క్రమశిక్షణ అంటూ లేదు – యిరవై నాలుగ్గంటలూ ఆ వంటింట్లో పడి నువ్వు ప్రత్యేకించి చేస్తున్న వంటా వార్పూ ఏముంది? గాడిదగుడ్డు? ఒక నాడైనా ముందుగా వండి ఒక అరగంట విశ్రాంతి తీసుకున్నావా? ఏనాడైనా ఎవరికైనా నవ్వుతూ కబుర్లు చెబుతూ వడ్డించావా? చాలు నీకూ నీ వంటకీ ఒక్క నమస్కారం."

గిరిజ లోపలికి వెళ్ళకుండా వేణు లోపలికి వెళ్ళి అడ్డగడియ వేసేశాడు. ఆ తలుపు దగ్గరే ఆమె కూలబడింది.

అయిదు నిమషాల్లో ఆమెలోని అభిమానం తారస్థాయిని అందుకుంది. తన తప్పేం లేదు. తలుపు తట్టవలసిన అవసరం ఆమెకేం లేదు. బతిమాలవలసిన దౌర్భాగ్యం ఆమె కేం లేదు. వాళ్ళనే తన కాళ్ళదగ్గిరకి రానీ. తన విలువ ఏమిటో తను లేనప్పుడే తెలుసుకోనీ.

మరొక అరగంటకి గిరిజ రైల్లో ఉంది. ఇలా వెళుతున్నానని యింట్లో ఆమె ఉంచిన చీటీ ఉంది.

* * *

స్నేహితురాలింట్లో పదిరోజులు కష్టపడి గడిపి ఇంటికి తిరిగివచ్చిన గిరిజనుచూసి పిల్లలు గెంతులేశారు. అయితే ఆమె పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరికి తీసుకోలేదు. భర్త ఎక్కడ ఏ పరిస్థితిలో ఉన్నాడో అని ఆమె కష్టపడాలేదు... తియ్యలేదు. తన సౌఖ్యానికి కేంద్రం ఎక్కడ ఉన్నాడని ఆమె అనుకుంటున్నదో అక్కడికే

దారితీసింది. తిన్నగా వంటింటివైపు నడచింది. తలెత్తి చూడగానే ఆమెకు గుండె ఆగిపోయినట్లు అయింది. వంటింటికి తాళం వేసి ఉంది!

అసలు ఆమె అంత తొందర్లో రాకనేపోను. అవతలివారు తన తప్పు తెలుసుకున్నారని దాఖలా కనిపించేదాకా ఆమె యింటిదారి పట్టకనేపోను. కాని ఉన్నవాళ్ళు ఊరుకున్నట్టు ఉండక పెద్దవాడు ఒకముక్క రాసి పడేశాడు. "మేమిక్కడ కులాసాగా ఉన్నాము. ఏ మాత్రం విసురూ, కోపం లేకుండా నాన్న నీకంటె బాగా వంట చేయుచున్నారు" ఇది చదువుకుని గిరిజ అక్కడ యిక ఉండలేకపోయింది. దొరికిన మొదటి రైల్లో యింటికి వచ్చి పడింది. తీరా వచ్చేసరికి యిక్కడేముంది!

"తాళంచెవి ఎక్కడా కనబడదేం? మాటాడరేం?" అమ్మ గాబరా చూచి పిల్లలు నవ్వుకున్నారు. ఆ నవ్వుచూసి గిరిజకు ఒళ్లు తెలియని కోపం వచ్చేసింది. అయితేనేం, ఆ కోపం అంతా పోయే లాగ, కడుపు చెక్కలయ్యేటట్లు ఆమె నవ్వుకొనేలాగ - ఆమె లేనప్పుడు యింట్లో జరిగిన తంతంతా పిల్లలు ఏకరువు పెట్టేరు.

అమ్మ ఎక్కడికో వెళ్ళిపోయిందని తెలిసి అంతంతపిల్లలూ ఏడుపుకి లంకించుకున్నారుట.

"ఎందుకు ఏడుస్తారు ఆడారి వెధవలు! వెళ్ళిపోయిందో, రక్షించింది! ఇలాంటి అదృష్టం ఎప్పుడు పడుతుందా అని ఏళ్ళతరబడి ఎదురుచూస్తున్నాను. మీ కాశలవలు నాకా నిమిత్తమాత్రమైన ఉద్యోగం. ఇంట్లోకూచుని మనం పడే పాటేముంది గనక! ఎడం చేత్తో వండిపారెద్దాం. ఏంకావలిస్తే అది చేసుకు మింగుదాం. ఊరుకోండి. చొక్కాల్తో కళ్ళు తుడుచుకోండి. ఎంతసులువుగా చేస్తానో, ఎంత నిమిషాల మీద పని కానిస్తానో, మీరే చూస్తారుగా!"

నిజమే, వేణుకి కొన్ని సుళువు లున్నాయి. కుడీ ఎడమా తేడా లేదు. అంటూ, ఎంగిలీ బాధ లేదు. రుచీ, అరుచీ భేదం కూడాలేదని పిల్ల లంటారు.

"వంట అనేది ఒక ఆర్టురా అబ్బాయిలూ! ఆర్టు అనేది అందంగా ఉండాలి. ఎవరైనా వంటయింటివైపు చూసేసరికి మొదట కనబడవలసినవి చింకిచేటా, గొరక చీపురూకాదు. నల్లగా ఉన్నదీ అసహ్యంగాఉన్నదీ ఎదురు



గుండా కనిపిస్తుంటే పనిచెయ్యడం నావల్ల గాదు. ముందు యిలాంటి మ్యూజియంలో పెట్టవలసిన వస్తువులు ఏం కనిపించినా. ఇదిగో పిల్లలూ, అటూ యిటూ సాయంబట్టి, ఒడుపుగా గోడ అవతలికి విసిరెయ్యండి. ఈ విషయంలో మీకుఫుల్‌ఫ్రీడమ్‌యిచ్చేస్తున్నాను."

రాజు ఒన్, టూ, త్రీ అనడం - యిద్దరూ మసిబారి మచ్చలతోఉన్న బూరెలమూకుడు లాంటిదాన్ని రెండు చెవులూ పట్టుకొని గిర వాటెయ్యడం - అరగంట దాటకుండా యింట్లో సగం పైగా వస్తువులు అవతలకి నడిచి పోయాయి.

"పిల్లలూ యిలారండి ... మీ అమ్మ ఎంత జాగ్రత్తమంతురాలో" అని వేణు ఒక్కగావుకేక వేసాడు.

"పొదుపు చెయ్యమని ప్రభుత్వం చేస్తున్న గోల అంతా పాపం మీ అమ్మ పూర్తిగా వంట బట్టించుకున్నటుంది. రూపాయనోట్లూ, బంగారం నగలూ బల్లమీదే, తీసిన సొరుగులోనే వదిలేస్తే వదిలెయ్యిగాక, కాని యీ పుల్లాజ్ఞి పుల్లమజ్జిగ జాగ్రత్త చూచితిరా? హబ్బా! దుర్భరమీ దుర్వాసన!"

తండ్రి పిల్లలు కలిసి మొట్టమొదట వంట యిల్లంతా అద్దంలా కడిగేరు.

"మీ కేదిష్టమో చెప్పండి. మొదట చేస్తాను" అన్నాడు వేణు.

"బంగాళా దుంప ముక్కలు వేయించండి" అన్నాడు రాజు.

ఎలాగో కష్టపడి నువ్వుగింజ మొదలు నిమ్మకాయ ఆకారం వరకు అనేక సైజుల్లో ముక్కలు తరిగేడు రాజు.

"ముక్కలు పెట్టుకోడానికి ఏదైనా తీసుకు రండి"

"ఏం లేవు. అలాంటివన్నీ విసిరేశాం."

"సరే. మరేం మించిపోలేదు. ఇదే సమయంలో మీ అమ్మ అయితే ఊరువాడా ఏకం చేసి ఉండును. ఆవిడకు అన్నీ ఉన్నాయి ఒక్క సమయస్ఫూర్తి తప్ప, నేనయితే చూడండి ఏం చేస్తానో!"

పేదర విసనకర్ర మీద చక్కగా ముక్కలు అమర్చాడు వేణు. మరో అయిదు నిమిషాలకి ఆమాట మరచి పోయి పరాకుగా ఆ విసనకర్ర తోనే కుంపటి విసిరేడు. పిల్లలు గొల్లు మన్నారు.

"ఎందుకలా పళ్ళు యికిలిస్తారు? ముందలా ముక్కలన్నీ ఏరి కడిగి యిలా యీ మూకుట్లో తగలడండి!"

కుంపటి కునికిపాట్లు పడుతూంటే, మూకుడు దించి, వేణు విసనకర్ర కాడతో ఓసారి బలంగా లోపల కదిపాడు. దాన్తో చట్రం ఊడొచ్చి కింద గుమ్మంలోంచి నిప్పు లన్నీ బయటకు గంతు లేశాయి. ఒకటి వేణు అరికాలు ముద్దెట్టుకోగా "అమ్మోయ్" అని అతను తేలు కుట్టినట్టు అరిచాడు.

మరో గంటకి ఎలా అయితేనేం కుంపటి మామూలు స్థితిలోకి వచ్చింది.

"అదేమోగాని ముక్కలు మన మిదివర కెన్నడూ ఎరగని ఏదో వాసన కొడుతున్నాయి నాన్నా" అన్నాడు రవణ.

"వెధవ కబుర్లు చెప్పకపోతే ముక్కలు కదపాలి కాబోలు; అట్లకాడ అందుకో కూడదూ?"

"దానిమొహం చూస్తే మండుతోందని యిందాక నువ్వన్నావుగా; విసిరేశాం నాన్నా" అన్నాడు రాజు.

"సరే; అట్లకాడ లేక కాలచక్రం ఆగిపోయి నట్టు నే నెక్కడా వినలేదు. ఒక్క పుష్కరం పైగా పెర్మనెంటు సర్వీసు ఉన్నా మీ అమ్మ అలా గింజుకునేదిగాని ఉపాయం ఉన్నవాడిని నాకేం? చూడండి ఏంచేస్తానో!"

బొగ్గులు కదిపిన విసనకర్ర కాడతోనే ముక్కలుకూడా కదిపివేయించాడు వేణు. మరో అయిదు నిమిషాలకి వీపు దురదవేస్తే అందుబాటులో మరేదీలేక దానితోనే గోక్కుని "అమ్మో" అన్నాడు.

"ముక్కలు చాలా కారంగా ఉన్నాయి నాన్నా" అన్నాడు రాజు ఆ రోజు తండ్రి వండిన వంట రుచి చూస్తూ.

"నీకూనా?"

"అవున్నాన్నా". చాలా కారంగా ఉన్నాయి" అన్నాడు రవణ.

"అలాగా? తర్వాత పూర్తి చేద్దురుగాని ముందు చేతులు కడుక్కోండి" పిల్లలిద్దరూ అర్థం కాక ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు.

"చెబుతున్నది నేను, మీ బాబుని, ముందు కడుక్కోండి."

తింటున్న అన్నాలు అలా వదిలేసి పిల్లలు చేతులు కడుక్కున్నారు.

"ఒకరి చెవులు ఒకరు పట్టుకోండి... తియ్యండి. గుంజీలు తియ్యండి...మీకేచెబ్తూంట ...పది గుంజీలు తియ్యండి. ఆఁ అలాగా... ఇప్పుడు చెప్పండి, ముక్కులెలా ఉన్నాయి?"

వాళ్లు మాటాడ లేదు. తల వంచుకు కూచున్నారు.

"వెధవన్నర వెధవల్లారా! మీకు వండి పెట్టవలసిన మీ అమ్మేమో ఊరూవాడ షికారు చేస్తోంది. ... మొగ మహారాజుని నాకు ట్రా యీ దరిద్రమంతా పట్టుకున్నదీ? ముచ్చెమటలూ పోసే లాగా రోజంతా కష్టపడి - ఏదో యిలా ఈ మాత్రం ఈ రూపంలో పెడుతున్నందుకు జన్మంతా రుణపడి ఉండక వంకలు పెడతారుట్రా వంకలూ? ఆ పనికి మాలిన దానిలాగ మీ నాటకాలు నేను సాగిస్తాననుకుంటున్నారేమో పొరపాటు. నా వన్నీ రూల్సు. ప్రిన్సు పిల్సు. పూర్వకాలం ఆచారాలు పట్టుకుని దేవుళ్ళాడను నేను. మంచినీళ్ళు అయినాసరే ఒకసారి మాత్రమే సర్వే చేస్తాను. రెండోసారి అడిగారా పీక నొక్కుతాను. కుక్కిన పేనుల్లాగా పడి ఉండండి!"

◆ ◆ ◆

"మంచి పనయింది, మీ కలా జరగవలసిందే" అనలేదు గిరిజ. పిల్లలిద్దరినీ దగ్గిరగా తీసుకుంది. "ఈ పది రోజుల్లోనే ఎంతలా చిక్కిపోయార్రరా!" అనుకుంటూ.

"ఇన్నాళ్ళూ యింత యిబ్బంది పడి, మరి ఉత్తరం అలా రాశారేం?"

"నాన్న అలా రాయమంటేనే."

"బాగుంది వరస. వంటింటికి తాళం వెయ్యమని కూడా ఆయన ఉపదేశమే కాబోలు-ఎక్కడుందో చెవి యిలా యివ్వండి."

పిల్లలు కొంత సందేహించి, తాళం తెచ్చి పడేశారు. వంటగది తలుపులు తీసిన గిరిజకు కొంతసేపు నోటమాట రాలేదు.



అన్ని వస్తువులూ స్థానభ్రంశం చెంది ఉన్నాయి. అసలు చాలా వరకు కనిపించడమే లేదు. గదంతా ఖాళీగా ఉన్నట్టుంది. ఎక్కడ చూసినా తెరలు! ఎదురుగుండా తెరతొలగించి చూసింది. అయిదు పదార్థాలకు అక్కడ ఉరిశిక్ష అమలుపరచబడి ఉంది. అవి వరసగా కత్తిపీట, అప్పడాలకర్ర, పచ్చడిబండ, కోరం. చీపురుకట్ట. ఏ వస్తువుకయినా సరే తాడు కట్టి షేకుకి తగిలించవలసిందే అనే భర్త బహుముచ్చటైన మనసు ఇన్నాళ్ళకు కదా తీరింది అని గిరిజకు నవ్వొచ్చింది.

"మీ నాన్నగారు ఏర్రా?"

"ఆసుపత్రిలో తీసుకుంటున్నారు."

"అదేం?"

దొరలు అన్నీ గాజుపళ్ళేలలో అమర్చినట్లు అన్నీ సీసాలలో అమర్చి పెట్టమని వేణు గిరిజను సాధించేవాడు. ఆమె ఆ ప్రతిపాదనని రెండోసారి వినకుండా కొట్టిపారేసేది. ఆమె గుమ్మందిగిన తరువాత, అతనికి స్వరాజ్యం వచ్చాక, అతను చెల్లించుకున్న ముద్దు అదే.

చక్కగా కనకాంబరం రంగు వచ్చేదాకా చారు మరగకాచుకొని. అంగులో ములక్కాడలూ, టొమాటో ముక్కలూ ఆర్టిస్టిక్‌గా కట్‌చేసి వేసుకుని, ఓ హార్లిక్సు సీసాలో పోసుకుని-వడ్డించుకునేటప్పుడు దగ్గిర పెట్టుకుంటే, స్వర్గానికి ఒక్క మెట్టే కదా తక్కువ!

భార్య వెళ్ళిన వారం రోజులవరకూ యింత మంచి ఐడియా మరిచిపోయినందుకు వేణు నొచ్చుకుని-సలసల మరుగుతున్న స్టౌమీంచి దింపిన చారు సీసాలోపోసి మూతపెట్టి ముద్దుగా దగ్గిర పెట్టుకున్నాడు. ఒకటి, రెండు, మూడు నిమిషాలు , సీసా టప్‌మని పేలింది. అతను లేచి గెంతులేచి గాజు ముక్కల్నితొక్కేశాడుట!

"పోనీ కాళ్ళకి కట్టాంటే అర్థం ఉంది. చేతులకి కూడా యీ కష్టేమిటి?" అంది గిరిజ భర్తని ఆసుపత్రిలో కలుసుకుని- "బాగుంది. ఆడకూతుళ్ళకయితే పుస్తెలూ అవీ ఏడుస్తాయి. డబ్బా మూతలు అవి ఎంచక్కా తీసుకోవచ్చు. మొగ ముండాకొడుకులు ఎంతకని చస్తారనుకున్నావ్? గోళ్ళతో బరికేవాణ్ణి. అన్నీ పచ్చి పుళ్ళయిపోయాయి."

మొగుడి మొహం చూస్తే గిరిజకు పోయిందేదో దొరికిందనే అనిపించింది. ఆమెకు నవ్వొచ్చింది. నోట్లోంచికాదు, హృదయంలోంచి!

* * *

తరవాత వారంరోజులకి - అంతా కులాసాగా ఉన్న ఓ ఉదయం వేళ, వీధి గదిలోంచి లోపలికి వస్తూ వేణు నేతిగిన్నె తన్నేశాడు.

"ఏమండీ మళ్ళీ అంటే మీకు కోపం, చేసిన చెత్తకారీ పనులుచూస్తే యిలాటివీ. పైచూపేకాని యింక కిందచూపు లేదా యేం? అసలే నెయ్యి ప్రియంగదా, దొరకనివస్తువయిపోయింది గదా..."

"సరిగ్గా దార్లోపెట్టావే, నీబుద్ధి ఏమయింది?"

"అయితే తప్పు మీది కాదంటారు?"

"నువ్వు చేసిన పనేమిటి, అది ముందు చెప్పు?"

"ఇప్పుడే యిక్కడ ఉంచాను. ఇంతలో పెద్ద పనిఉన్నట్టు తమ రిలా హడావిడిగా ఇటు దయచేస్తారని నా కేం తెలుసు?' అయినా అంతగా చూపు ఆనదని నా కేం తెలుసూ?"

"అయితే నీ కంటికి నేను గుడ్డివాడిలా కనిపిస్తున్నానన్నమాట!"

"అదొక్కటే కాదు. దుర్మార్గత కూడా ఉంది."

"నిన్ను మించిన చుప్పనాతి ఉందీ?"

"మిమ్మల్ని మించిన ధూమ్రాక్షుడో?"

* * *

ఈ గాలి విసురుకి మతిలేదు.

ఈ మేఘాలకి బుద్ధిలేదు.

ఎప్పుడూ ఎక్కడా ఉండే ఈ "ఉరుములతో కూడిన జల్లులు" గురించి ఎవరి జ్యోతిష్యమూ అక్కర్లేదు.